www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 28 జూన్ 2025
5
అన్నమయ్య

ఉచిత గుండె వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారతీయ అంబేద్కర్ సేన, కోలార్ నారాయణ హృదయాలయ వారిచే స్థానిక మదనపల్లె అమ్మచెరువుమిట్ట మున్సిపల్ హైస్కూల్లో ఈనెల 29వ తేదీన ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు పిటిఎం శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉచిత వైద్య శిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి భౌతిక శ్రమకు దూరమై, మానసిక ఒత్తిడికి ఎక్కువగా గురవుతున్న నేపథ్యంలో గుండె సంబంధిత జబ్బుల బారిన పడే వారి సంఖ్య ఎక్కువైందన్నారు. గుండె జబ్బులు ప్రమాదకరమైనవని, వాటికి ఆధునిక వైద్యం అందుబాటులో ఉందని, సరైన సమయంలో గుర్తించి వైద్యం చేయిస్తే ప్రాణాపాయం నుండి బయటపడవచ్చని పేర్కొన్నారు. ఈ శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కిరణ్ కుమార్ గుండె జబ్బులపై అవగాహన కల్పించి, గుండెకు సంబంధించిన ఇసిజి, ఎకో, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రోగ నిర్ధారణ అయిన వారికి కోలార్‌లోని నారాయణ హృదయాలయ వారిచే ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకుడు కోనేటి దివాకర్, బాస్ నాయకులు ముత్యాల మోహన్, సూరి, గంగాధర్, పాల్గొన్నారు.

అడ్డంకుల్లో అన్నదాత సుఖీభవ

- కడపలో 1,626 మందికి మొండిచేయి
- అన్నమయ్యలో 5,937 మందికి తిరస్కృతి
- రెవెన్యూలో ఆన్‌లైన్, ఇకెవైసి అడ్డంకులు
- పట్టని రెవెన్యూ, వ్యవసాయ శాఖలు
- ఆందోళనలో ఉమ్మడి జిల్లా రైతాంగం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకం సందేహాలకు తావిస్తోంది. ప్రభుత్వం రైతుల ఖాతాల్లో సుఖీభవ పథకం నిధులను జమ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. కడప జిల్లా వ్యవసాయశాఖ 1,97,718 మంది రైతుల రిజిస్ట్రేషన్లు నమోదు చేసింది. రాష్ట్రంలోని కూటమి సర్కారు వేలిముద్ర నమూనాను ప్రవేశపెట్టింది. గత వైసిపి సర్కారు ఇటువంటి నిబంధనలతో నిమిత్తం లేకుండా జిల్లా వ్యాప్తంగా 1,99,344 మంది రైతులకు రైతుభరోసా పథకం పేరుతో మూడు విడతలుగా రూ.13,500 వేల చొప్పున నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.7,500, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు చొప్పున విడుదల చేసిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి రైతుకు రూ.20 వేలు చొప్పున ఇస్తామని చెల్లిస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. వైసిపి సర్కారు హయాం నాటి 1,99,344 మంది రైతుల సంఖ్యతో కూటమి సర్కారు 1,97,718 మంది పోల్చితే 1,626 మంది రైతుల ఖాతాలు గల్లంతు కావడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు చెల్లించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఇదేతరహాలో అన్నమయ్య జిల్లాకు చెందిన 1,95,781 మంది రైతులకు గానూ 1,87,493 మందికి ఇకెవైసి పూర్తి చేసినట్లు తెలుస్తోంది. 2351 మందికి ఇకెవైసి తిరస్కరణకు గురికాగా 5,937 మంది రైతుల పేర్లు పెండింగ్ ఖాతాలో ఉన్నట్లు తెలుస్తోంది. వైసిపి సర్కారు హయాంలో రైతుల భూముల ఆన్‌లైన్ లోపాలు రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సరిదిద్దడం తెలిసిందే. కూటమి సర్కారు హయాంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖలు ఆన్‌లైన్ లోపాలను సరిదిద్దని పరిస్థితి కనిపిస్తోంది. పట్టాదారు పాస్ పుస్తకాల ఖాతాల సంఖ్య, ఒన్‌బిలను ఆన్‌లైన్ చేయడంలో రెవెన్యూ యంత్రాంగం అంతులేని నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. రాష్ట్రంలోని కూటమి డబుల్ ఇంజిన్ సర్కారుకు చిత్తశుద్ధి కొరవడిన నేపథ్యం రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు రావడం ఖాయమని తెలుస్తోంది. రెవెన్యూ, వ్యవసాయ శాఖలు తన వంతు పాత్ర పోషించడంలో పరస్పరం పోటీ పడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సైతం సీరియస్‌గా తీసుకుని వైసిపి సర్కారు హయాంలోని 1,626 మంది లబ్ధిదారులకు స్వచ్ఛందంగా ఆన్‌లైన్, బ్యాంకింగ్ తదితర సేవలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

కాల్‌మనీ వేధింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు డిమాండ్
- ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కాల్‌మనీ పేరుతో వేధింపులకు పాల్పడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం కాల్ మనీ వేధింపులకు బాధితులతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లి పట్టణంలో ఏకాంబరంరెడ్డి, ఖాదరవల్లి, ఆనంద్, అనురాధ వారు ఒంటరి మహిళలను టార్గెట్ చేసి అప్పులు ఇచ్చి వారి చేత ఖాళీ చెక్కులు, బాండ్లు తీసుకుని అత్యధిక వడ్డీలు వసూలు చేయడమే కాకుండా, తీవ్రమైన వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. వడ్డీ వ్యాపారం చేయాలంటే కలెక్టర్ వద్ద నమోదు చేసుకోవాలనే కనీస నిబంధన పాటించడం లేదన్నారు. ప్రభుత్వ పెద్దల సహకారం లేకుండా అక్రమ వసూళ్లకు పాల్పడలేరని వివరించారు. కాల్‌మనీ విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరు అనుమానస్పదంగా ఉందన్నారు. అత్యధిక వడ్డీలు, వేధింపులు తట్టుకోలేక గౌరీ లాంటి వారు బహిరంగ ప్రకటన చేయగలిగారు కానీ, చాలా మంది బయటకు చెప్పుకోలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధితులను గుర్తించి వారికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నదని తెలిపారు. అనంతరం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందచేశారు. స్పందించిన కలెక్టర్ మోసపూరితంగా ఉండే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఖాళీ చెక్కులు, బాండ్లు ఇవ్వకూడదని సూచించారు. ఎస్‌పికి ఫోన్ చేసి కాల్‌మనీ వేధింపులకు పాల్పడుతున్న వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమం కాల్‌మనీ బాధితులు గౌరీ, సుజాతలతో పాటు, సిపిఎం నాయకులు రామాంజులు, రామచంద్ర, మాధవ పాల్గొన్నారు.

ప్రభుత్వ మోసాలపై ప్రజల్లో చైతన్యం నింపాలి : వైసిపి

మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కూటమి ప్రభుత్వ మోసాలపై ప్రజల్లో చైతన్యం నింపాలని వైసిపి నాయకులు అన్నారు. శుక్రవారం వైసిపి జిల్లా కార్యాలయంలో రీకాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టోపై మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించి పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం నింపి టిడిపి మోసాలపై స్పష్టతనిస్తూ జగన్ పాలనలో అమలైన సంక్షేమ పథకాలను వివరించాలని నేతలు సూచించారు. కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు, సూపర్‌సిక్స్ పథకాల అమలు విఫలమైందని ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజలకు చేరువయ్యేందుకు ఈ కార్యక్రమంలో క్యూఆర్ కోడ్ స్కాన్ విధానాన్ని ఉపయోగించాలని తెలిపారు. వైసిపి కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రజలకు జరిగిన నష్టాన్ని వివరించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేతలు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లె ఇన్‌ఛార్జి నిస్సార్ అహమ్మద్, జడ్‌పి మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

ధన ఉన్మాదం రాజ్యమేలుతోంది : 'సుగవాసి'

కూటమి ప్రభుత్వంలో ధన ఉన్మాదం రాజ్యమేలుతోందని, 164 మంది ఎమ్మెల్యేలు అవినీతి చేయడం లేదని కాణిపాకంలో ప్రమాణం చేస్తారా అంటూ ఇటీవల టిడిపి నుంచి వైసిపిలో చేరిన సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం పట్టణంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 365 రోజులు అవుతుందని 265 రోజుల కిందటే గ్రామాల్లో, మండలాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను తాను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి వల్లే పార్టీ వీడి వైసిపిలో చేరానన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు చెప్పింది ఒక్కటి, గెలిచిన తర్వాత చేస్తున్నది మరొకటన్నారు.

ఇవిఎం గోదాము వద్ద పటిష్ట నిఘా : కలెక్టర్

ఇవిఎం గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాకు సంబంధించి ఇవిఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24×7 ప్రకారం నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇవిఎంల గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఆయా ఇవిఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్‌లను, అక్కడి భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. అనంతరం కలెక్టర్ తన చాంబర్లో వివిధ పార్టీల ప్రతినిధులతో ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా పెరిగిన చోట్ల పోలింగ్ కేంద్రాలు పెంచడం పోలింగ్ కేంద్రాల మార్పులు చేర్పులు తదితర అంశాలలో సందేహాలు, సూచనలను సంబంధిత ఇఆర్ఒలకు సమర్పించాలని పార్టీల ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.మధుసూదన్‌రావు, ఆర్‌డిఒ ఎ.శ్రీనివాస్, తహశీల్దార్ నరసింహ కుమార్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హార్సిలీహిల్స్ భూములను ప్రయివేట్ వ్యక్తులకు కేటాయిస్తే సహించం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్ర ఊటీగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో కార్పొరేట్ సంస్థకు భూములు అప్పగించడాన్ని మదనపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్, సిపిఐ, ఎఐటియుసి, ఆమ్ ఆద్మీ, సిపిఎం, బాస్ సంస్థ నాయకులు వ్యతిరేకించారు. ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చొరవ తీసుకొని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అ పార్టీ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు, నాయకులు కృష్ణప్ప, మురళి, ఎఐటియుసి నాయకులు సాంబశివ, ఆమ్ ఆద్మీ పార్టీ సయ్యద్ రహీం, బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్, సిపిఎం ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈశ్వరమ్మ, మహమ్మద్ అలీ హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ రాందేవ్ బాబాకు భూములు కట్టబెడితే వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలతో కలసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. వ్యాపారవేత్త రాందేవ్ బాబా మదనపల్లె చేరుకున్న సందర్భంలో సబ్ కలెక్టర్, డిఎస్‌పి, అధికారులు స్వాగతం పలకడంపై ఆక్షేపించారు. హార్సిలీహిల్స్‌లో వైసిపి ప్రభుత్వం యాత్ర సినిమా డైరెక్టరుకు భూ కేటాయింపులు చేస్తే వ్యతిరేకించిన అనాటి కూటమి నాయకులు నేడు పతంజలి కార్పొరేట్ సంస్థకు అప్పగించడాన్ని ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కార్పొరేట్ సంస్థ కోసం భూ కేటాయింపు చేస్తే సమర్థించ బోమని ప్రజా ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. నరసింహులు, కృష్ణప్ప, మురళి, సాంబశివలు మాట్లాడుతూ టూరిజం ప్రాజెక్టు కింద హార్సిలీహిల్స్‌ను మరింతగా అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం ఒక మతానికి సంబందించిన పతంజలి కార్పొరేట్ సంస్థకు భూములు అప్పగిస్తే అది ప్రజలకు తీవ్రమైన నష్టమన్నారు.

పెన్షనర్ల నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లెలోని ఎపిఎన్‌జిఒ భవన ప్రాంగణంలో శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల అసోషియేషన్ మదనపల్లె శాఖ నూతన కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు అవసరమైన అన్ని సౌకర్యాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తాను. అనుక్షణం వారికి అందుబాటులో ఉంటాను అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మదనపల్లె శాఖ అధ్యక్షుడు బి.టి.నరసింహులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల కృషి, పెన్షనర్ల సహకారంతో ఈ భవనం నిర్మాణం సాఫల్యంగా పూర్తయిందని తెలియజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు రెడ్డెన్న, ఎల్.ఆత్మానంద నాయుడు పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అసోషియేషన్ చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ఎపిఎన్‌జిఒ అధ్యక్షుడు ఎస్.నరసింహారెడ్డి, సెక్రటరి రెడ్డిశేఖర్, సభ్యులు తరిగొండ నాగరాజ, చలమయ్య, సాబీర్ బాషా, భాస్కరరెడ్డి, చిన్నప్ప, రాధ, రెడ్డెప్పరెడ్డి, బండి రెడ్డెప్ప, రెడ్డెప్ప నాయుడు, శ్రీనివాసులు, అనంతరామారావు, నరసింహులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. పట్టణంలోని విజయభారతి పాఠశాలలో విద్యార్థి నాయకుల ఎన్నికలలో గెలచిన విజేతలను శుక్రవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా సత్కరించి మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సేవా గుణాన్ని అలవర్చుకోవాలని పేర్కొన్నారు. విజయభారతి పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత పదవులు సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచితవిద్యను అందిస్తూ పలువురికి స్ఫూర్తిగా ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ సేతు మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్ బాషా నిత్యం ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కార దిశగా ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా కాకుండా సామాన్యుడిలా ఉంటూ కష్టం అని వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యను సావధానంగా వింటూ వారికి సాధ్యమైనంత వరకూ న్యాయం చేసేందుకు పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల నూతన ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన నిశ్చిత సేతును దుశ్శాలువతో సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డి, తెలుగుదేశం పార్టీ పరిశీలకుడు గురుమూర్తి, పాఠశాల ప్రిన్సిపల్ నిశ్చిత సేతు, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

తరిగొండ మెడికల్ ఆఫీసర్‌గా చిన్నరెడ్డెప్ప

బాధ్యతలు స్వీకరిస్తున్న రెడ్డెప్ప

ప్రజాశక్తి-వాల్మీకిపురం

గుర్రంకొండ మండలం తరిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ చిన్న రెడ్డెప్ప ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా మేడికుర్తి పిహెచ్‌సి నుంచి తరిగొండ పిహెచ్‌సికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సిలో కాన్పుల సంఖ్యను పెంచుతామని పేర్కొన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. కార్పొరేటు వైద్యంకు ధీటుగా పిహెచ్‌సిలో వైద్య సేవలు అందిస్తామన్నారు. అనంతరం సిబ్బంది డాక్టర్‌ను సన్మానించారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని హెల్పింగ్ హాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రక్తం ఇవ్వడంలో ఎటువంటి ఇబ్బంది హానికరం ఉండదు అని ఇంకా రక్తం ఇవ్వడం వలన చాలా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. పట్టణంలోని బోస్ నగర్ ఏరియాకు చెందిన అత్యవసర సమయంలో ఓ గర్భిణికి (బి పాజిటివ్) రక్తం అవసరం గాక శ్రీ దీప బ్లడ్ బ్యాంక్‌లో మహమ్మద్ అనే యువకుడు చే రక్తదానం చేయించి వారికి అందజేశామన్నారు. అత్యవసర సమయంలో స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన మహమ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ కిలక సభ్యులు మహమ్మద్, సుఫియాన్, జావీద్, రక్త నిధి సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లకు ఎర్ర బ్యాడ్జీలతో నిరసన ధర్నా చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కళ్లకు గంతలు కట్టుకుని కార్మికుల నిరసన

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు 36 జిఒ అమలు చేయాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కళ్లకఉ గంతలు కట్టుకుని శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, శంకరయ్య మాట్లాడుతూ పని గంటలు పెంచి కేవలం రూ.15 వేల వేతనం ఇస్తున్నారని పారిశుధ్య కార్మికులతో పాటు రూ.21 వేలు వేతనం ఇవ్వాలన్నారు. వయో పరిమితి 62 సంవత్సరాలకు పెంచి ఆప్కాస్ కొనసాగించాలని లేనిచో పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమపథకాలు అమలుచేయాలని, రక్షణ పరికరాలతో పాటు నాణ్యమైన పనిముట్లు సరఫరా చేయాలన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయకపోవడాన్ని కార్మికుల్ని దగా చేయడం కాదా అని ప్రశ్నించారు.

బాస్, రైతు సంఘం మద్దతు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకూ అన్ని రకాల మద్దతు ఇస్తామని భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లము తాతయ్య, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామచంద్ర పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆప్కాస్ కొంసాగించి ప్రవేట్ ఏజెన్సీ లకిచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజల నుండి ఇబ్బం దులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన చెందారు. నీటి కొరత నివారణకు పాలక అధికార యంత్రాంగం చర్యలు చేపట్టి ప్రజల ఆక్రోషం నుండి కాపాడాలని తెలి పారు. ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల సాధన పోరాటానికి అన్ని విధాలుగా అండ గా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కార్మికులు దేవా, రమేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటలక్ష్మి, మౌనిక, రమణ పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్ జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

హెలెన్ కెల్లర్ జీవితం ప్రత్యేక ప్రతిభావంతులకు ఆదర్శమని వెలుగు ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపల్ లీనాకుమారి తెలిపారు. పట్టణంలోని అమ్మచెరువు మిట్టలోని వెలుగు సంస్థలో శుక్రవారం ఘనంగా హెలెన్ కెల్లర్ డేని జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లీనా కుమారి మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ బాల్యం గురించి వివరించారు. అమెరికాలో 1880, జూన్ 27న జన్మించిన హెలెన్ కెల్లర్ ఏడాదిన్నర వయసులో తీవ్ర మెదడు రుగ్మతకు గురై చూపు, వినికిడి, మాట్లాడే శక్తిని కోల్పోయారని పేర్కొన్నారు. తరువాత క్రమంగా కోలుకున్న ఆమె వికలత్వాన్ని ఎదుర్కొంటూనే రచయితగా, రాజకీయ కార్యకర్తగా రాణించి, వికలాంగులు, మహిళల హక్కుల కోసం ఎంతో పోరాటం చేశారని పేర్కొన్నారు. సోషలిస్ట్ పార్టీలో చేరి, యుద్ధాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలను చైతన్యం తీసుకొచ్చారని తెలిపారు. మహిళా హక్కుల గూర్చి రచనలు రాసి, హక్కుల సాధనకు ఉద్యమాలు నడిపారన్నారు. ది స్టోరీ ఆఫ్ మై లైఫ్ గ్రంథ రచనతో తన పుస్తక రచనలకు శ్రీకారం చుట్టి అనేక ప్రఖ్యాత రచనలను వెలువరించారని పేర్కొన్నారు. వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చూపులేకపోతే నడవలేమని, పనులు చేసుకోలేమన్నారు. హెలెన్ కెల్లర్‌కు చూపులేక పోయినా, మాటలు కోల్పోయినా, ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా వికలత్వం కల్గిన ప్రతి ఒక్కరికి మార్గదర్శకురాలుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది, విభిన్నప్రతిభావంతులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

స్వర్ణాంధ్ర విజన్-2047 పకడ్బందీ అమలులో భాగంగా నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌లో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకుగా సచివాలయ సిబ్బంది అత్యంత చురుకుగా పాల్గొనాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సుపరిపాలన తొలి అడుగు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌పై ఎంపిడిఒలు, తహశీల్దార్లు, స్పెషల్ అధికారులతో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సిపిఒ, డిఆర్‌డిఎ పీడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌లో ప్రభుత్వం నిర్దేశించిన 10 ప్రధాన సూత్రాలతో కార్యాచరణ ప్రణాళికను నిర్దేశించుకుని జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని పేర్కొన్నారు. డేటా మేనేజ్మెంట్, డేటా అనాలసిస్‌లో సచివాలయ సిబ్బంది అత్యంత చురుకుగా పనిచేయాలన్నారు. ప్రభుత్వా లక్ష్యాలు సాధించేందుకు తపనతో పని చేయాలన్నారు. ఇకనుండి నియోజకవర్గ యూనిట్లే కీలకం కానున్నాయన్నారు. ప్రధానంగా పేదరికం లేని సమాజం, ఉద్యోగాల కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, అంతర్జాతీయ స్థాయి రవాణా సదుపాయాలు, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు-బ్రాండింగ్, స్వచ్ఛాంధ్ర, డీప్‌టెక్ విభాగాలను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్దేశించారని ఈ దిశలో పయనించేందుకు ఎంపిక చేసిన సచివాలయ సిబ్బంది అత్యంత చురుకుగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకుని వాళ్ల ఉన్నతికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం సూచించిన నిర్దిష్ట లక్ష్యాలతో ముందుకు వెళ్లి అన్ని పారామీటర్లలో 15 శాతం వృద్ధి రేటు సాధించాలని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్-2047 తీసుకొస్తే దానికి అనుబంధంగా రాష్ట్రంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పనకు నిరంతర కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద గృహ వినియోగదారులు తమ ఇళ్ల పైకప్పుపై సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకోనేలా విస్తృత అవగాహన కల్పించాలని ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించి విజయవంతం చేశారని కలెక్టర్ సంబంధిత అధికారులను అభినందించారు.



వేలంపాట నిర్వహిస్తున్న ఎ.మునిరాజ

వేలంపాట ఆదాయం రూ.31 వేలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

స్థానిక పట్టణంలోని శ్రీ గ్రామదేవత ఆలయానికి సంబంధించి, పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఏడు షాపు రూముల నిర్వహణ కొరకు బహిరంగ వేలంపాటను శుక్రవారం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.మునిరాజ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం ఆవరణంలో ఈ వేలం పాటను దేవాదాయ శాఖ నిబంధనలకు లోబడి నిర్వహించామని అన్నారు. మూడు సంవత్సరాల కాలపరిమితితో నెల బాడుగులకు వేలంపాట నిర్వహించినట్లు తెలిపారు. బహిరంగ వేలంలో రూ.10వేలు ధరావత్తు చెల్లించి 25 మంది పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. ఏడు రూముల్లో రెండు రూములకు ఎవరూ వేలంపాట ఆసక్తి చూపకపోవడంతో రెండు రూములు మినహాయించి ఐదు రూములు వేలంపాట నిర్వహించినట్లు తెలిపారు.గతంతో పోల్చుకుంటే రూ.9,700లు లాభం వచ్చిందన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు ఇన్స్‌పెక్టర్ శశి కుమార్, ఇఒ ఎండోమెంట్ మునిరాజు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైసిపి నేత 'పంజం' మృతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పంజం సుకుమార్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

వైసిపి సీనియర్ నాయకులు, అన్నమయ్య జిల్లా రైతు సలహా మండలి మాజీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి(62) మృతి చెందారు. ఆయన గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో చెన్నైలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోటశివసాయి, జిల్లా యూత్ అధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి, జడ్‌పిటిసి రత్నమ్మ, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, సర్పంచులు దార్ల చంద్రశేఖర్, హరికృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యంరాజు, కవిత చంగల్ రెడ్డి, రామకృష్ణ, గోపి, శ్రీరామ్ వినోద్, ఎంపిటిసిలు జనార్దన్ రాజు, మల్లికార్జున, మహేష్ ఘన నివాళులర్పించారు.

విద్యార్థులతో సౌభాగ్యవతి

విద్యా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా మహిళా విభాగం వైస్ చైర్మన్, టిడిపి మండల నాయకురాలు సౌభాగ్యవతి మండంలోని సీతారం పేట, పెరియవరంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు అవసరమైన విద్యా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సౌభాగ్యవతి మాట్లాడుతూ తాము గత కొన్ని సంవత్సరాల నుండి అనేక సామాజిక సేవా కార్యక్రమాల చేస్తున్నామని అన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్ళ తదితర విద్యా సామగ్రిని అందించినట్లు తెలిపారు. అందించామన్నారు. కార్యక్రమంలో పెరియవరం ఉపాధ్యాయులు మురళి, సుబ్బలక్ష్మి, సీతారంపేట ప్రధానోపాధ్యారాలు ఎన్‌పి.మాదవి పాల్గొన్నారు.

ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్యురాలు లక్ష్మీప్రసన్న తెలిపారు. ప్రధానమంత్రి టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సబ్ జైల్లో సూపరిండెంట్ మల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖైదీలకు క్షయ వ్యాధి పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉండడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, చాతీలో నొప్పి, అలసట, చెమటలు పట్టడం, మెడలో వాపు రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా గల్ల పరీక్ష, ఎక్సరే వంటివి చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు వికాస్, సౌజన్య, టిబి సూపర్‌వైజర్ జయప్రకాష్, జగన్ పాల్గొన్నారు.

పశువైద్యాధికారిగా డాక్టర్ గణేష్

ప్రజాశక్తి-వీరబల్లి : చిన్నమండెం మండలంలో పశువైద్యాధికారి పనిచేస్తున్న డాక్టర్ గణేష్ బదిలీపై వీరబల్లి పశువైద్యాధికారిగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇదే మండలంలోనే పశు వైద్యాధికారి పని చేశానని మరల ఇక్కడికే రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామాల్లో పశు సంరక్షణ కోసం కృషి చేస్తానని చెప్పారు. మండలానికి మళ్లీ పశువైద్యాధికారిగా రావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఇక్కడ పశువులకు మంచి వైద్య సేవలు అందించారని కొనియాడారు.

పొలంలో 8 అడుగుల కొండ చిలువ

ప్రజాశక్తి - ముద్దనూరు

జమ్మలమడుగు రహదారిలోని జగనన్న కాలనీ సమీపంలో రైతు వేణు గోపాల్ రెడ్డి పొలంలో శుక్రవారం 8 అడుగుల కొండ చిలువ కనిపించింది. కొండ చిలువ కోడిని మింగడంతో కదలేని స్థితిలో ఉంది. గమనించిన రైతు దానిపైన మట్టి పోశారు. దాంతో కొండచిలువ కదల్లేక మట్టి కింద ఉండి పోయింది. అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డిఆర్ఒ శ్రీనివాసులు, సిబ్బందితో వచ్చి కొండ చిలువను పట్టుకుని అడవిలో వదిలేశారు.

పాస్ పోర్ట్ పోయినది

అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం కొత్తపేట పంచాయతీ పరిధిలోని కేతవాండ్లపల్లి గ్రామం లో నివాసం ఉంటున్న పుల్లగెంటి చిరంజీవి గారి భార్య పుల్లగెంటి రమణమ్మ కి చెందిన పాస్ పోర్ట్ మే 10 వ తేదీ న తమ గ్రామం అయినా కేతవాండ్లపల్లి నుంచి పుల్లంపేటకు ప్రయాణిస్తున్న సమయంలో నాకు చెందిన ఒరిజినల్ పాస్ పోర్ట్ నెంబర్ X1048980పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గాని 9948952577, మొబైల్ నెంబర్ కు గాని తెలుపగలరు.

సామూహిక సెలవులో పంచాయతీ కార్యదర్శులు

- ఎంపిడిఒలకు వినతి పత్రం అందజేత

నిమ్మనపల్లి : ఎంపిడిఒకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి -రైల్వేకోడూరు

పంచాయతీరాజ్ శాఖలో పనిచేసే గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వం విధించే పని భారం తట్టుకోలేక రాష్ట్ర సంఘం ఆదేశాలు మేరకు రెండు రోజులపాటు సామూహిక సెలవులు పెట్టినట్లు కార్యదర్శులు తెలిపారు. ఈ మేరకు వినతిపత్రాన్ని శుక్రవారం ఎంపిడిఒ నాగార్జునరావుకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజులపాటు సామూహిక సెలవులు పెట్టి అనంతరం జిల్లా కేంద్రంలో అధికారులకు వినతిపత్రం అందజేసి నిరసన కార్యక్రమం చేపడతామని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 గంటలకు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టే చెత్త సేకరణలో పాల్గొనాలని, అదే సమయంలో లైవ్ లొకేషన్‌తో పాటు వీడియో కాల్ చేయాలని , వీడియోలు తీసి పంపాలని అధికారులు ఒత్తిడి తెరుస్తున్నారని అన్నారు. చెత్త సేకరణ కార్యక్రమం గురించి ప్రభుత్వం ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల వద్ద నుంచి సమాచారం సేకరిస్తుందని తద్వారా కార్యదర్శులపై చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితి పంచాయతీ కార్యదర్శులకే ఎందుకు అని వారు ప్రశ్నించారు. ప్రతిరోజు సాయంకాలం ఐదు గంటల అనంతరం వీడియో కాన్ఫరెన్స్ లు సమావేశాలు ఎక్కువగా నిర్వహిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళ పంచాయతీ కార్యదర్శులు ఇంటి వద్ద ఇంటి పని పిల్లలకు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే వారికి క్యారియర్లు పెట్టి పంపే కుటుంబ బాధ్యతలు ఉంటాయని, అలాంటివారు ఉదయం 6 గంటలకు ఏ విధంగా చెత్త సేకరణలో పాల్గొంటారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇలాంటి పని ఒత్తిడిని తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మహేష్, హరితమ్మ, లక్ష్మన్న, దొరబాబు, జ్యోతి, సురేష్, ప్రసన్న ,దుగ్గిరెడ్డి పాల్గొన్నారు. **రామాపురం :** గ్రామపంచాయతీ సచివాలయల కార్యదర్శులకు పని భారం, పని ఒత్తిడి తగ్గించాలని మండలంలోని 13 గ్రామపంచాయతీ కార్యదర్శులు ఎంపిడిఒ జాషువాకు వినతి పత్రం సమర్పించారు. పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికే గ్రామపంచాయతీలోని అన్ని రకాల సర్వేలు, స్వర్ణ పంచాయతీ పనులు, ఇంటి పన్నుల వసూలు, ఫ్రోన్‌యాప్, రెవెన్యూ వారి పిజిఆర్ఎస్ పనులు చేస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో పంచాయతీ కార్యదర్శులను గ్రామ పెద్ద పాలేరుగా చేసి పడేసిందని అన్నారు. గ్రామాలలో చెత్త సేకరణలు వెళితే తన పొలాలకు ఎరువులు కావాలని నిరాకరిస్తున్నారని అన్నారు. కార్యదర్శులు అప్పుచేసి హరిత రాయబారుల ఆర్థిక అవసరాలు తీర్చాల్సి వస్తుందని అన్నారు. ప్రభుత్వం కార్యదర్శుల కష్టాలను ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యదర్శిలకు పని భారం , పని ఒత్తిడి తగ్గించి న్యాయం చేయాలన్నారు. **నిమ్మనపల్లి :** పంచాయతీల అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై పడుతున్న పని భారం భరించలేక పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య వారి పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవులపై వెళ్లడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. శుక్రవారం నిమ్మనపల్లి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అందరూ కలిసి తమకున్న సమస్యలను పరిష్కరించాలని, పని భారం తగ్గించాలని, లేకుంటే సామూహిక సెలవులను మంజూరు చేయాలని ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. వివరాల్లోకి వెళితే...రాష్ట్రంలో గత కొంత కాలంగా పంచాయతీల కార్యదర్శిలకు అనేక రకాల పనులను, సర్వే లను అప్పగించి చేయిస్తుండటమే కాకుండా, ప్రస్తుతం ప్రతిరోజు ఉదయం ఏడు గంటలకే క్షేత్రస్థాయిలో చెత్తను సేకరించడానికి హాజరుకావాలని ఆదేశించడంతో పంచాయతీ కార్యదర్శులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే అనేక రకాల పనులతో, సర్వేలతో గ్రామంలో విస్తృతంగా తిరుగుతూ సహనంతో, మానవతా దృక్పథంతో పని భారమైన భరిస్తూ ఉద్యోగ బాధ్యతను నిర్వర్తిస్తున్నా మన్నారు. అయితే గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతిరోజు ఉదయాన్నే గ్రామాలకు వెళ్లి యోగాసనాలపై ప్రజలకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటింటా చెత్తను సేకరించడానికి అనువైన వాహనాలు అందుబాటులో లేకపోవడం, తమ శ్రమకు తగిన జీతం అందడం లేదని పారిశుధ్య కార్మికులు రాకుండా పోతుండడం పెద్ద సమస్యగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా చెత్తను సేకరించడానికి అవసరమైన మోటారు వాహనాలను అందించాలని కోరారు. తమ సమస్యలను జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఉన్నతాధికారులు గుర్తించి పరిష్కరించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య వారి పిలుపు మేరకు శనివారం నుంచి పంచాయతీ కార్యదర్శులు సామూహిక సెలవులపై వెళ్లడానికి నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మారప్ప, వెంకటరమణారెడ్డి, రాజేష్, గాయత్రి, గౌతమి, సరస్వతి, నౌరిన్, మమత పాల్గొన్నారు. **వీరబల్లి :** మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సామూహిక సెలవుకు అనుమతి ఇవ్వాలని ఇఒపిఆర్‌డి రామ చంద్రారెడ్డికి వినతి పత్రం అందించారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో మండల పంచాయతీ కార్యదర్శులు సమావేశం ఏర్పాటు చేశారు. శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ధర్నా చేస్తామన్నారు.గత 16 నెలలుగా గ్రామ పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోయినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోయినా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో సమర్థవంతంగా పనిచేశామని అన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** తమ సమస్యలను జిల్లా అధికారులకు మొరపెట్టుకునేందుకు తమకు సామూహిక సెలవు మంజూరు చేయాలని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ మనోహర రాజుకు వినతిపత్రం అందించారు. సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ఈ నెల 28వ తేది శనివారం తమకు సామూహిక సెలవుపై వెళ్లెందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

రామాపురం : ఎంపిడిఒ జాషువాకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

అరవపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ రాంప్రసాద్

ప్రజాశక్తి-నందలూరు

క్రీడాకారులు జయాపజయాలను సమానంగా స్వీకరిం చాలని డాక్టర్ అరిగే రాంప్రసాద్ పేర్కొన్నారు. ఆరవపల్లిలోని నంద లూ రు జడ్‌పి హైస్కూల్ క్రీడా మైదానంలో అరవపల్లి క్రికెట్ లీగ్ ఆధ్వ ర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ తమ సత్తా చాటాలని సూచించారు.

ప్రెస్ లెవన్స్‌పై జూనియర్ ఫైటర్స్ విజయం

ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో ప్రెస్ లెవెన్స్ పై జూనియర్ ఫైటర్స్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన ప్రెస్ లెవెన్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఏడు వికెట్లను కోల్పోయి 50 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన జూనియర్ ఫైటర్ జట్టు 6 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేసి విజయం సాధించింది. విజేత జట్టు ఆటగాడు చింటూ మూడు వికెట్లును తీసి మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ సొంతం చేసుకున్నాడు.

సౌమ్యనాథ లెవన్స్‌పై మందపల్లి జట్టు విజయదుందుభి

మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్‌లో సౌమ్యనాథ జట్టుపై మందపల్లె జట్టు విజయం సాధించింది. ముందు బ్యాటింగ్ చేసిన మందపల్లి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో ఆరు వికెట్లను కోల్పోయి 111 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన సౌమ్యనాథ జట్టు 12 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆల్ అవుట్ అయ్యారు. మందపల్లె జట్టు ఆటగాడు శీను 29 పరుగులు చేయడంతో పాటు, మూడు వికెట్లను తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. టోర్నమెంట్‌లో హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షులు వేపగుంట సాంరాజ్, పుత్తశంకర్, అరవపల్లె క్రికెట్ లీగ్ సభ్యులు అరుణ్, బుల్లెట్‌హరి, నవీన్, రాము క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

నట్టల నివారణతో జీవాలకు మేలు

నందలూరు : గొర్రెలకు మందులు వేస్తున్న సర్పంచ్ సూర్యనారాయణ

ప్రజాశక్తి-నందులూరు

నట్టల నివారణ ద్వారా జీవాలకు ఎంతో మేలు జరుగు తుందని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్య నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పశువైద్యాధికారిణి మాధవిలత ఆధ్వర్యంలో ఇసుకపల్లి, కుమ్మరపల్లి గ్రామాలలో జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ జంబు సూర్య నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నట్టల నివారణ మందు తాపించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా ఉంటాయన్నారు. తద్వారా పోషకులకు మేలు జరుగుతుందని ఈ అవకా శాన్ని మేకలు. గొర్రెలు పెంచే ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకో వాల న్నారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, ఎహెచ్ఎలు శిరీష, జాహ్నవి లు పాల్గొన్నారు. **కలకడ:** గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులను తప్పక వాడాలని రాయచోటి డివిజన్ సంచాలకులు డాక్టర్ కె.మాలకొండయ్య రైతులకు సూచించారు. మండలంలోని దేవులపల్లి పంచా యతీ లోని బొజ్జ గుంటపల్లి, కె.దొడ్డిపల్లి పంచాయతీ గోపాలపురం గ్రామాల్లో నట్టల నివారణ కార్యక్రమాన్ని పర్య వేక్షించినట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులు వారి వద్ద ఉన్న గొర్రెలకు మేకలకు నట్టల నివారణ మందులను తప్పక వాడాలని సూచించామన్నారు. మూడు నెలల వయసు దాటిన ప్రతి జీవానికి మందులు తాగించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటాయని అన్నారు. జూలై 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం అన్ని గ్రామాలలో చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మండలంలో 75 వేల గొర్రెలు, మేకలు ఉన్నాయని పెంపకం దారులు ఈ అవకాశాన్ని ఉచితంగా సద్విని చేసుకో వాలని కోరారు. కార్యక్రమంలో మండల సహాయ సంచాలకులు కృష్ణయ్య, పాపిరెడ్డిగారిపల్లె వైద్యాధికారి తేజకల్యాణ్, గ్రామ సహాయ సంచాలకులు మోహన్ బాబు, పవన్ పాల్గొన్నారు.

కలకడ : గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న మాల కొండయ్య

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలి

సంఘమిత్రల సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి-కలికిరి

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని పీడీ సత్యనారాయణ ఎపిఎం దేవసేనను ఆదేశించారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో సంఘ మిత్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ హాజరై ఎస్‌హెచ్‌జి, ఎంఎల్‌పిల గురించి, ఉన్నతి, శ్రీనిధి, విఒ సంఘాల రికవరీ గురించి సమీక్షించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్యాంకర్స్‌తో బేసిక్‌కు వెళ్లి హెచ్ఎల్ పిఐ గ్రౌండింగ్ చేయమని తెలిపారు. శ్రీనిధి మేనేజర్ మౌనిక స్నేహితులు, రికవరీ గురించి చర్చించారు. కార్యక్రమంలో డిపిఎం గంగరాజు, వేణుమాధవ్ ఎపిఎం, ఎఫ్‌పిఒ రమేష్, మండల ఎపిఎం దేవసేన, సిసిలు, సంఘమిత్రులు, రికవరీ డైరీ మేనేజర్ కిజర్ పాల్గొన్నారు.

వృద్ధురాలికి నిత్యావసర సరుకులు అందిస్తున్న డీలర్ మల్లేశ్వరరావు

వయోవృద్ధులకు ఇంటి వద్దే నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్ర ప్రభుత్వం 65 ఏళ్ల పైబడిన వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు చౌకదుకాణాల ద్వారా అందాల్సిన నిత్యావసర సరుకులను డీలర్లే వారి ఇంటి వద్దకు వెళ్లి అందించాలని ఆదేశించడంతో మండలంలోని చౌక దుకాణ డీలర్లు నిత్యవసర సరుకుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా చౌకదుకాణ డీలర్ల సంఘం మండల ఉపాధ్యక్షుడు మల్లేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు, వయోవృద్ధులకు ప్రత్యేక ప్రతిభావంతులకు చౌక దుకాణాల ద్వారా అందాల్సిన నిత్యవసర సరుకులను వారికి ముందుగానే అందించాలన్న ఉద్దేశంతో ప్రతినెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక ముందస్తు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపాం చౌక దుకాణ డీలర్లు నిత్యవసర సరుకులను, బియ్యంను తీసుకువచ్చి వృద్ధుల ఇంటికే చేరుస్తున్నారని తెలిపారు. మండలంలో ముందస్తు నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా జరుగుతోందని అన్నారు.

ఏజెన్సీ ప్రారంభోత్సవంలో యల్లటూరు శ్రీనివాసరాజు, జనసేన నాయకులు

వాటర్ ఏజెన్సీ ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శ్రీ లక్ష్మీ శ్రీనివాస జింక్ ఫ్లస్ వాటర్ ఏజెన్సీ డీలర్లు సుధా రాయల్, కుమార్ రాయల్ ఆహ్వానం మేరకు శుక్రవారం జింక్ ఫ్లస్ వాటర్ ఏజెన్సీని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు యల్లటూరు శ్రీనివాసరాజు ప్రారంభించారు. కడప-చెన్నై జాతీయ రహదారిలో రాజంపేట అరవింద్ ఐకేర్ పక్కనే ఉన్న శ్రీలక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్ జింక్ ఫ్లస్ డీలర్లు సుధారాయల్, కుమార్ రాయల్‌తో కలిసి స్వామివారికి శ్రీనివాసరాజు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జింక్ ఫ్లస్ వాటర్ ప్రత్యేకతలు, ప్రయోజనాల గురించి ఆయన వివరించారు.జిల్లా ప్రజలు జింక్ ఫ్లస్ వాటర్‌ను వినియోగించుకుని వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు. జింక్ ఫ్లస్ వాటర్ పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండడం ఆనందదాయకమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి యల్లటూరు శివరామరాజు, మైనార్టీ నాయకులు అబూబకర్ పాల్గొన్నారు.

ప్రయివేట్ కళాశాలల యాజమాన్యంతో మాట్లాడుతున్న డిఎస్‌పి

సైబర్ నేరాలపై విద్యార్థుల్లో చైతన్యం : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సైబర్ నేరాలపై విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని డిఎస్‌పి మహేంద్ర తెలిపారు. ప్రయివేట్ కళాశాలల యాజమాన్యంతో శుక్రవారం డిఎస్‌పి కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరగాళ్ల బారిన పడి, మోసపోకుండా చైతన్య పరచాలని యాజమాన్యానికి సూచించారు. అలాగే ప్రతి కళాశాలలోనూ సిసి కెమెరాలు అమర్చాలని, డ్రగ్స్, ఈవ్ టీజింగ్ వంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థినిలు ఫోన్లో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం వల్ల ఆపద సమయంలో రక్షణ పొందవచ్చని తెలిపారు. శక్తి యాప్ వినియోగంపై, దాని ఆవశ్యకత గురించి అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో సిఐ ఎరిసావల్లి, రామచంద్ర, సత్యనారాయణ, కళా వెంకటరమణ, ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తూకాల్లో మోసాన్ని నివారించాలి

ప్రజాశక్తి - వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే రేషన్ బియ్యం తూకాలల్లో డీలర్లు బకెట్లు పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా, జిల్లా కో- కన్వీనర్ దాదా పీర్ కోరారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉన్న తహశీల్దార్ హరినాథ్‌రెడ్డికి ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు రేషన్ బియ్యం పంపిణీపై వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా వేంపల్లెలో రేషన్ బియ్యం పంపిణీ చేసే డీలర్లు పేదల బియ్యంలో కూడా కోతలు విధిస్తున్నారని చెప్పారు. డీలర్లు తూకాలు వేసే సమయంలో ప్లాస్టిక్ బకెట్లులో బియ్యం వేసి తూకాలు వేయడం వల్ల 25 కిలోలకు, మూడు కిలోలు తక్కువ వస్తుందన్నారు. ప్రజలు తీసుకొని వెళ్లిన సంచుల్లోనే బియ్యం వేసి తూకాలు వేసే విధంగా డీలర్లుకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రజల కళ్ల ముందే దోపిడి జరుగుతున్నా ఏమి చేయని నిస్సహాయ స్థితిలో ప్రజలు ఉన్నారని చెప్పారు. వయస్సు పైబడిన వారికి వేలి ముద్రలు పడక పోయిన బియ్యం సరఫరా చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చిన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి తూకాలలో మోసం చేస్తే అలాంటి డీలర్లుపై చర్యలు తీసుకొంటామని తహశీల్దార్ నాయకులకు హమీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు గౌస్, షఫి, అహమ్మద్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య పేర్కొన్నారు. శుక్రవారం మలేరియా సబ్ యూనిట్ అధికారిఆధ్వర్యంలో వేంపల్లిలోని 1వ సచివాలయం పరిధిలో 'ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటా లార్వా సర్వే నిర్వహించి మురుగు కాలువల్లో నిలిచిన నీటి నిల్వలను తొలగించి పరిసరాల శుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వృద్ధిని నివారించడానికి ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, ఫైలేరియాసిస్, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధులు వస్తాయని చెప్పారు. కాబట్టి దోమకాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరు దోమ తెరలు వాడాలని సిద్దయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి బాబా ఫ్రకృద్దీన్, హెల్త్ సూపర్ వైజర్ అంకయ్య, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీదేవి, శిరీష, ఆశా కార్యకర్తలు జయమ్మ, కృష్ణవేణి, లక్ష్మీ నరసమ్మ , కుమారి పాల్గొన్నారు. **చెన్నూరు :** పారిశుధ్య పనుల పైన ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిడిఒ కిరణ్ మోహన్ రావు అన్నారు. శుక్రవారం చెన్నూరులోని పారిశధ్య పనులను పరిశీలించారు. కార్మికులు గ్రామంలోని వీధుల్లోని చెత్తాచెదారాలను తొలగించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. చెన్నూరులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఇఒఆర్‌డి సురేష్ బాబుతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో చెన్నూరు పంచాయతీ కార్యదర్శి రాంసుబ్బారెడ్డి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.